# నిదురించే తోటలోకి...

అవనిరంగం మీద చీకటి తెరలు రెపరెపలాడుతున్నాయి. భానుడి ఆగమనాన్ని స్వాగతిస్తూ పౌష్యమి మంచుముత్యాల్ని గడ్డిపరకల మీద అద్దుతోంది. నిశ్శబ్దరణంలోని నిట్టూర్పులు ఆవిరై...

కలల జలతారు మీద స్వప్నశారికలో చలిని మరింత చల్లబర్చి వూరుని వణికిస్తోంది.

ఇంకా తెల్లారలేదు...

అప్పుడు...

ఆ ఇంట్లోంచి...ఒక్కసారిగా ఏడ్పులు... పెడబొబ్బలు... కేకలు మొదలయ్యాయి. అవి తారాస్థాయినందుకుంటే ఊరు ఉలిక్కిపడింది!

బద్దకం చల్లారిన వూరు బరువుగా మూలిగింది. అశనిపాతమై పాకిన వార్త!

"పదహారేళ్ళ లలిత చచ్చిపోయిందట..." ప్రకృతి కూడా లలితలో "పూర్ణమ్మ"ను చూసుకుందేమో....ప్రభాతగీతం పాడదామని గొంతువిప్పిన తొలికోడి నోరు తెరచి అలాగే వుండిపోయింది.

కనుసందుల్లోంచి వెలుగురేఖల్ని జారవిడుద్దామని రెప్పల చిప్పల్ని తెరుస్తున్న భానుడు వార్తవిని భారంగా చీకటినే పంచాడు.

తల్లి పొదుగులో తలదాచుకున్న లేగదూడ పాలు తాగడం మరచి మూగబోయింది. నత్తగుల్లల మధ్య చేపపిల్లలాంటి లలిత "మొనాలిసా"లా మౌనంగా నవ్వేది.

ఆ మౌనంలో తారట్లాడే ఒంటరితనం...ఆ ఒంటరితనంలో కొను క్కునే నిశ్శబ్దం....ఆ నిశ్శబ్దంలో వెదుక్కునే ఏకాంతం...లలిత ముందూ, వెనక మౌనం....మౌనం!! ఆమె మౌనానికి జడిసి ఇంట్లో వాళ్ళు కేకలేసినా. ఆ మౌనం వెనకగల ఆలోచననీ ఆవేదనని ఎవరూ అర్థం చేసుకోకపోయేరు. ఆ ఇంట్లో అనుభవాలకు ఆదికావ్యం లలిత!

అలాంటి లలిత చావుకూడా నిశ్శబ్దంగా సాగితే....అనుమానంగా పూరు కదిలింది.

వాళ్ళేడుస్తున్నారు...

స్మశానంలో ప్రేతాత్మల మహాయజ్ఞపు మంత్రోచ్చరణలా....వాళ్ళ ఏడుపుల్లో స్వార్థం. వాళ్ళ ఏడుపుల్లో భయం,వాళ్ళ ఏడుపుల్లో అవమానం....

అసహాయుడైన తండ్రి...

అవసరాలు చూడని తల్లి...అధికారం ప్రదర్శించిన అన్న.... రోగిష్టి అక్క....దొంగచూపుల బావ...పక్కింటి సారథి ...అంతా ఏడుస్తున్నారు.

ఊరి జనం ఎక్కువైనకొద్దీ మరింత బిగ్గరగా...వాళ్ళ కన్నీళ్ళు చల్లగా వుంటాయి. గుండెల్లోంచి రావుకాబట్టి. చెంపల మీద చారల మరకల్ని ఏర్పరచవు, అవి నకిలీవి కాబట్టి.

"నిన్నటి వరకూ బాగా తిరిగిన అమ్మాయి....ఒక్కసారిగా ఎలా చచ్చిపోయింది?" మాటల తూటాల పిస్టల్‌కి మొదటి ట్రిగ్గర్ నొక్కబడింది జనంలోంచి.

"అదే అర్థం కాలేదు. కాలేజీలో ప్రేమించిందంటారు. నిజమే కావచ్చు." ఒక ఎలక్ట్రిక్ డిటనేటర్ నిశ్శబ్దంగా ప్రేలింది.

"కడుపు కొంచెం ఎత్తుగా వుంది చూసావు....నెల తప్పిందేమో?" లలిత పొత్తికడుపుమీదికి ఒక గ్రేనేడు విసిరారు. అనుమానాస్పదమైన ఏడుపుల మధ్య అనంతంలో మమేకమైన లలిత అతి ప్రశాంతంగా నిద రోతుంది! అక్కడికొచ్చిన వాళ్ళందరూ...ఒక్కసారిగా అయిదొందల బుల్లెట్లు దూసుకురాగల ఎకె....47 చైనా మేడ్ రైఫిల్స్‌లా వున్నారు.

"బ్రతికున్నప్పుడు నిన్ను రావిరంపాన పెట్టుకున్నామే తల్లీ...." లలిత తల్లి శోకమేసింది. జనం అనుమానంతో ఆ వాక్యం అక్కడ చుక్కని రాల్చి నెత్తిన క్వొశ్చన్ మార్కు కొడవళ్ళని లేపింది. వీళ్ళ చూపులకి భయమేసి వాళ్ళేడుస్తున్నారు?

"విన్నావా? మొన్న గొల్లపల్లి సంబంధం చేసుకొమ్మని తండ్రి తిట్టాడట. ముగ్గురు పెళ్లాలు చచ్చిన ముసలాడ్ని చేసుకోనని మొండి పట్టుతో ఈ పిల్ల....అదే సంబంధం ఖాయం చేద్దామనుకున్నారేమో.... చచ్చిపోయింది పాపం"

బబ్బర్ ఖాల్సా ఆయుధ గిడ్డంగి లాంటి అక్కడి మెదళ్లలోంచి జాలి కురుస్తోంది.

అది జాలి కావచ్చు....క్షణంలో రాయి కావచ్చు!

తెల్లారుతోంది.

బూట్ల టకటకలు గుండెల్లో ప్రతిధ్వనిస్తే తండ్రి చూపులు గుమ్మం వైపు భయంగా చూసాయి. పోలీసు కేసులు...పొడి పరిశోధనలు.... పోస్ట్ మార్టంలు....కదలాడి కళ్ళల్లో "మరోరకం" నీళ్ళు తిరిగాయి.

ఆ కేసుల వాసన సోకకుండా ఆపాలి? ఎలా??

"ఇంకా ఎందుకేడుస్తారు? ఎందుకు చచ్చిందో. ఎలా చచ్చిందో ఉత్తరమేదైనా రాసిందేమో ఇంట్లో చూసారా?" ఆర్మేనియంలో భూకంప మొచ్చినంత సడెన్‌గా ఎవరో అన్నారు.

క్షణాల్లో ఏడ్పులు తగ్గుముఖం పట్టాయి.

ఉత్తరం...ఉత్తరం....ఉత్తరం—కాదు మరణ వాంగ్మూలం!!

ఈ పదం గుర్తుకొచ్చి గుండెలు గుభిల్లుమన్నాయి. ఆ మరణ వాంగ్మూలంలో తన పేరేమైనా లేదు కదా! ఎవరి ఆలోచన వారి మన సులో భయాన్ని లోడ్ చేస్తోంది.

ఆ భయంతో మళ్ళీ ఏడ్పులు...

ఆ ఏడ్పుల్ని ఎందరర్థం చేసుకోగలరు? ఒక్క లలిత అమ్మ తప్ప!!

ఎవరో లలిత గదినంతా వెతుకుతున్నారు. అల్మారాలు....బొట్టు పెట్టెలు...పాఠ్యపుస్తకాలు....ట్యూషన్ నోట్సులు....లైబ్రరీ నవలలు....

ఆగదిలోంచి ఏ దుర్వార్త వస్తుందోనని ఆసక్తిగా కొందరు, భయంగా ఇంకొందరు చూస్తున్నారు. ఇంతలో ఒకావిడ లలిత నోట్సు లోంచి జారిపడ్డ మడిచిన 'చీటీ'ని పట్టుకొచ్చింది. ఏడుస్తున్న వాళ్ళ గుండెలు మొద్దుబారాయి!

ఎంతటి కంగారు...? ఎంతటి ఆత్రుత??

అక్కడ ఆత్రుత కన్పించని ఆకారం ఒక్కటే...లలిత శవం!!

ఎవరో ఆ చీటిని చదివారు.

"జానే ఒకైసే లోగ్ థే జిన్ కె
ప్యార్‌కో ప్యార్ మిలా....
హమ్‌నే జబ్ మాంగ్ థే ఫూల్
కాటోంకా హార్ మిల్తా..."

ఎవరికీ అర్థం కాలేదది కాని కొంత ఊపిరి పీల్చుకున్నారు.

(ప్రేమకు ప్రతిగా ప్రేమ లభించిన మనుషులు ఎటువంటి అపురూపమైన మనుషులై వుంటారో కదా! నేను పూలు కావాలని కోరుకుంటే నాకేమో ముళ్లహారం లభిస్తుంది.)

సాహిర్ లూధ్వియాన్వీ అమరగీతాన్ని అర్థం చేసుకుని లలిత మనస్తత్వాన్ని అన్వయించుకొంటే కొందరికైనా అర్థమయ్యేది లలిత చావు. తెలుగు పదాలే మాట్లాడక మౌనంగా వుండే అమ్మాయి హిందీ గేయం రాసుకోవటం వింతగా తోచింది కాని...మనసు గాయాన్ని అర్థం చేసుకోలేకపోయారు.

భయం ఆలోచనని కప్పేస్తుంది.

"ఉత్తరం రాయకపోయినా...ఏద్రైనా మింగిందో....ఏమైనా తాగిందో ఓసారి వంటిల్లుకూడా వెదకండి" వంటింటివైపు పరుగులు... గిన్నెల చప్పుడు. విషాదకరమైన సందడి!!

అన్నిటికీ చిర్నవ్వే శేషంగా మిగిల్చే లలిత పెదాలమీద ఈగలు ముసిరితే కన్నీళ్లనించి తప్పించుకోలేని తండ్రి మనస్సు కలుక్కుమంది.

లలిత చావుకి కారణం తనేనని!!

తన నిస్సహాయతని కప్పిపెడుతూ "నిర్ణయం" పేర కసాయిగా శాసించాడు. సుబ్బారావు కిచ్చి పెళ్ళి చేస్తానని.

"అక్క రోగిష్టిదయ్యాక బావ విడాకులిస్తానని బెదిరిస్తున్నా డమ్మా...నీ నిర్ణయమేంటో చెప్పు?" ఈ ఒక్కమాట లలితకి ఎన్ని కన్నీళ్ల రాత్రుల్ని, కలత నిద్దర్లని మిగిల్చిందో. ఆ మాటలోని అంత రార్థాన్ని కన్నీటితో అభిషేకించి కఠిన శిలాజాలం ఛేదించి మృత్యువు ముందు ముకుళిత హస్తాలతో ఎందుకు మోకరిల్లిందో ఇప్పుడు తెలుసు కున్న తండ్రి ఒక్కసారి గతంలోకి పోయాడు.

*  *  *

ఆ రోజు ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.

"అమ్మా...లలితా!" అని పిలిచాడు.

తెచ్చి పెట్టుకున్న ప్రేమ తాలూకు ఆర్టిఫిషియాలిటీ అంతరాన అర్థం చేసుకున్నా మౌనంగా తలెత్తి చూసింది లలిత.

ఆ చూపులో తండ్రికే అర్థంకాని తీక్షణత.

"ఈ సంవత్సరం నీపెళ్లపుతే నా బాధ్యత తీరుతుందమ్మా!' భావ జలదరింపు లేని ఒక మామూలు పనిలా చెప్పాడు.

కుడుతున్న పని ఆపింది. ఏ విధమైన ప్రతిస్పందన లేదు. ధైర్యం కూడదెచ్చుకొని నారాయణరావ్ అసలు మాట చెప్పాడు.

"అక్క రోగిష్టిదయ్యాక బావ విడాకులిస్తానని బెదిరిస్తున్నా డమ్మా...నీ నిర్ణయమేంటో చెప్పు?" అయినా అతడి గొంతులో ఎక్కడో నరాలు జీరబోయి వణికాయి.

కన్నెపిల్లలకు కలల పంటలుంటాయని, సీతాకోకచిలుకలై వూహలు పూలతోటల్లో విహరిస్తాయని, అన్నీ తీర్చి అత్తారింటికి దారి చూపాల్సిన

తండ్రి....కట్నం ఇవ్వలేని తన అసమర్థతని కప్పిపుచ్చి, అక్క భవిష్యత్తుని అడ్డం పెట్టుకొని చేతులు దులుపుకోవాలనుకున్నాడు.

లలితలో చలనం లేదు. ఈ మనుషుల మధ్య స్పందనెప్పుడో చచ్చిపోయింది. నీ నిర్ణయం చెప్పమని లాలనగా అడిగినా, పోచమ్మకు బలిచేసే మేకకు వేపకొమ్మల దండలు వేసినట్టు అడిగాడు.

లలిత మౌనంగానే వుంది.

గుండెల్లో ఉధృతంగా ఎగిసిపడుతున్న కెరటాలు.... తండ్రి మొహంలోకి చూసింది. ఆ చూపులోని 'నిర్వేదం' తట్టుకోలేక పంచె భుజాన వేసుకొని బయటికెళ్ళాడు నారాయణరావ్.

ఆనాటి సంఘటన గుర్తొచ్చి తండ్రి మనస్సు కలుక్కుమంది. తను నిర్దాక్షిణ్యంగా శాసించినందుకే లలిత చచ్చిపోయిందన్న నిజం గుర్తొస్తూ కుళ్ళికుళ్ళి ఏడుస్తున్నాడు. లలిత చావుకి కారణం తనేనని....

నిజానికి ఒక రాయి పదిసమ్మెట దెబ్బలకు పగిలితే... ఆ రాయి పదవ దెబ్బకు మాత్రమే బ్రద్దలయినట్టుకాదు...ఆ ఫలితం మిగతాతొమ్మిదీ దెబ్బలది కూడా...

మానసిక చిత్తక్షోభకు ఇంకెందరో కారణం...

రక్తం పంచిన తల్లికూడా...!

* * *

ఆడది మరో ఆడదాని దగ్గరకు సాయంకోసం వచ్చినపుడు లాలింపుతో కూడిన ప్రేమ కనబరుస్తుంది. ఇది తల్లీకూతుళ్ళ నడుమైనా, ప్రక్కింటాళ్ళ మధ్యనైనా. అవసరాన్ని బట్టి ప్రేమభిమానాలు కురిపించటంలో స్త్రీలు చేసుకునే రంగాలంకరణ చాలా పకడ్బందీగా, పటిష్టంగా వుంటుంది.

"నీ ఇష్టం లేకుండానే బావతో నీ పెళ్ళి ఎలా జరుగుతుందే. మీ నాన్న పిచ్చికాకపోతే... అయినా రెండురోజులు పెళ్ళాం మంచమెక్కగానే తగుదునమ్మా నంటూ నీ వెంట పడటమేనా? రేపొద్దున మీఅక్క బాగయి

కాస్త కండపెట్టగానే నీ వైపు చూస్తాడా? అయినా రెండో పెళ్ళివాడిని చేసుకోవడం నీకేం ఖర్మ...."

లలిత వింటుందో లేదోనని ఆగింది తల్లి.

"ఆ బట్టలు నేను పిండేస్తాలే... నువ్వెళ్ళి ముఖం కడుక్కొని బొట్టు పెట్టుకో..." కూతురి పట్ల ఆప్యాయత గుమ్మరించింది.

అయినా లలిత అక్కడ తననెవరూ పలకరించటం లేనంత ముభావంగా తన పని చేసుకుంటోంది.

"నీకు రెండోపెళ్లి చస్తే కానివ్వను. నువ్వు బాధపడకు. రేపు వెంకట్రావు మామయ్యకు ఉత్తరం రాసి వెంటనే ముహూర్తాలు పెట్టించమని..." కూతురి ముఖాన్ని దొంగచాటుగా గమనిస్తూనే మాట పదిలంగా విడిచింది.

"మన 'ప్రసాదం' ఏదో వ్యాపారం చేసి బాగా సంపాదిస్తున్నాడట. నేనడిగితే కాదనరు. కట్నం, గిట్నం అంటె నామీద మిగిలిన బంగారాన్ని అమ్మేద్దాం....వింటున్నావా?" అనుమానంగానే అడిగింది తల్లి.

లలిత నోరు విప్పలేదు.

"నిన్నే అడుగుతున్నది..." సౌదీమీద 'స్కడ్' క్షిపణి కూలినంత శబ్దంతో అడిగింది. లలిత నిశ్శబ్దంగా తలూపింది.

"మీబావ ప్రసాదం అంటే నీకిష్టమేగదా?"

దిండుకింద పుస్తకాలు చదివి, పెద్ద మనిషి కాని పిల్లలమీద దుర్భావపు ప్రయోగాలు చేస్తూ, బలాదూర్‌గా తిరిగే ప్రసాద్ గుర్తొచ్చాడు లలితకు. అది గమనించినట్టుంది తల్లి.

మీ మావయ్య ఆస్థంత వాడికే కదా! కొద్దిగా బాధ్యత తెలిస్తే ఇంటిపట్టునే వుండిపోడూ!"

లలిత ఔను...కాదులకు మధ్య తలూపింది.

"అలా మాటమీదే వుండు. మీ అక్క మొగుడి సంగతి నే చూస్తాను" కూతురు ఎక్కడ తన మనసు మార్చుకుంటుందోనని హడావిడిగా ఇంట్లోకి పరిగెత్తింది. భర్తతో చెప్పడానికి.

అలాంటి లలిత...

తెల్లారే సరికి శవంగా మారటం....ఆమెని భయపెట్టింది. తనెంత తప్పు చేసిందో అర్థమైంది. తన తప్పే బిడ్డని బలి తీసుకుందేమోనని గొల్లున ఏడుస్తుంది.

అదే రోజు సాయంత్రం...

"లలితా...లలితా...." వగరుస్తూ, అరుస్తూ, వచ్చాడు అన్న రాజశేఖరం. పందిరికింద మల్లెపూలు తెంపుకుంటున్న లలిత వింతగ చూసింది అన్నని.

"ఏం చెముడా....చెవులు నెత్తికెక్కాయా? పిలిస్తేపలకవే?" దగ్గరి కొచ్చి హుంకరించాడు.

ఏమిటన్నట్లు కనుబొమ్మలు ముడిచింది.

"నిన్న సాయంత్రం ఎక్కడ చచ్చావ్? ప్రయివేట్ పూర్తయ్యాక"

అతడి ప్రశ్నకు సమాధానం మౌనమే.

"మా...ట్లా....డ....వే..." చాచి కొట్టాడు లలిత చెంపమీద. క్షణాల్లో బుగ్గఎర్రగా కందిపోయింది. నిర్లిప్తమయిన కళ్లలోంచి కన్నీటి ధార జారి పడింది.

"ఆ సారధిగాడితో పార్క్కి వెళ్లావ్...అవునా?"

తిరిగి గాల్లోకి లేచిన చేతిని భయంగా చూసింది.

"రాత్రంతా ఇంటికి రాకుండా ఏంరాచకార్యాలు వెలగబెడుతున్నావ్?" అని లలిత రాజశేఖరాన్ని అడగలేదు. మౌనాన్ని ఛేదించి అలా అడిగి వుంటే ఆ చేతికి అంత ధైర్యంరాదు.

"వాడికీ, నీకూ పార్క్‌లో కలుసుకునేంత స్నేహమా?...రేపట్నించి కాలేజీమానెయ్. బయటికి అడుగు పెట్టావో కాళ్ళు చేతులు విరుగుతాయ్...." అని శాసించాడు.

ఇంట్లో తండ్రి, తల్లి, అక్క, అన్న, బావ అందరూ వున్నా ఒంటరితనం అనుభవించే ఒక ఎడాలిసెంట్ అమ్మాయి చాలా సాధారణంగా

తన వయసులో వున్న మరొక కుర్రాడి మాటల్లో ఓదార్పు వెతుక్కుంటుం దని రాజశేఖరానికి అర్థంకాదు ఎప్పటికీ!

ఒక గూండా కొత్తగా పట్నం వచ్చిన పల్లెటూరు వాడిని కత్తి చూపించి బెదిరించినట్లు హుంకరించాడు. మరో అరగంట సేపు.

లలిత శవం చూసాక.... రాజశేఖరానికి తన మగపాత్ర గుర్తొచ్చి భయంగా వణికిపోయాడు.

చెల్లెలి శవంవైపు చూసి భయంగా ఏడుస్తున్నాడు...

కాలం గడిచిన కొద్దీ లలిత శవం బిగుసుకుపోతోంది. ఇంక అక స్త్రీ ఏడ్పులకు తట్టుకోలేనట్టు... బావ సుబ్బారావ్ ఇక ఏడ్వటం ఆపేశాడు.

మామగారి మాట ప్రకారం.... లలిత బ్రతికుంటే భార్యగా మిగిలేది. ఆ అవకాశం పోయినందుకు మాత్రమే బాధేసి ఏడ్చాడు ఇంతవరకూ.

మొన్న సాయంత్రం పెరట్లోని బాదం చెట్టుకింద....మెల్లిగా చేయి పట్టుకున్నప్పుడు ఏ భావమూలేకుండా చూసింది. అ చూపులో ఏ ఉద్రేకం, ఉద్వేగం, సిగ్గూ ఏవీ లేవు.

రెప్పల చిప్పల్ని నిశ్శబ్దంగా పైకెత్తి చూసింది.

తన పెళ్లంకూడా బావున్నా... అ ముఖంలో వుండాల్సిందేదో లేదు. అకస్మాత్తుగా బైట పడింది రోగం... మూడేళ్లుగా రోగిష్టి పెళ్ళాన్ని భరిస్తు న్నాడు. ఏ సుఖమూలేదు. అందుకే మామదగ్గర లలిత ప్రస్తావన ఎత్తి తప్పుకున్నాడు. ముసలాడు మాత్రం చస్తాడా? ఈ రోజుల్లో ఎంత కట్నం కావాలి? ముందు లలిత మనసు తెల్సుకోవాలనే ... చేయిపట్టుకొని మెల్లిగా చెప్పాను.

"చూడు లలితా...నేను మామూలు మగాడ్నే....నాకూ కోరికలుం టాయి. నీకు మాత్రం వుండవా? మీ అక్కకు వుండవా? కాని అదేం చేస్తుంది, మాయదారిరోగం రాకూడని సమయంలో వచ్చింది. నేను మీ అక్కను విడిచి వెళ్లిపోయాననుకో...అప్పుడేమవుతుందో ఆలోచించుకో. నిన్ను నేను మల్లెపువ్వులా చూసుకుంటాను... మీ అక్క నువ్వూ రక్తం

పంచుకొని పుట్టారు. ఆమె కోసం ఈ మాత్రం త్యాగం చేయలేవా?...." అని బ్రతిమిలాడాను.

లలిత మౌనమే అంగీకారమనుకున్నా...కాని ఇదేంటి? ఇలా జరిగింది?

ఆరోజు తన చేయిని సుతారంగా రాపిడి చేస్తున్నపుడు అప్పుడే వచ్చిన అక్క-కంట్లో ఆ దృశ్యం పడింది.

ఫలితంగా లలిత చెంప మరోసారి పగిలింది.

"ఎక్కడికీ కదలకుండా నన్నే గమనిస్తుంటుంది కుష్ఠు ముఖంది" సుబ్బారావ్ జారుకున్నాడు.

"నా కాపురంలో నిప్పులు పోయకే..." అని ఏడ్చినప్పుడు లలిత జాలిగా....మౌనంగా చూసిందెందుకు? ఆ చూపులో దైన్యం నిండిన తెరలు.

ఆయన తన చెల్లిమీద కన్నువేయటం తను భరించగలదా ? తన చెల్లెల్ని 'సవతి'గా అంగీకరించగలదా? అందుకే లలితను చెడామడా తిట్టేసి...కొట్టింది.

తను రోగంతో అల్లల్లాడిపోతుంటే తనకెన్నో సేవలు చేసిన చెల్లెల్ని తానే పొట్టన పెట్టుకుందా?

భయంతో పాటు దగ్గు తెర ముంచుకొచ్చింది. ప్రేగులు నులిపెట్టినట్లయి...చెల్లెలి శవమ్మీద పడి భోరున ఏడుస్తోంది.

ఈ పాపంతో తన రోగం ముదిరి....భర్త వదిలి...తన బ్రతుకు అష్టకష్టాల పాలవుతుందనే మౌఢ్యపు సెంటిమెంటాలిక్ భయంతో ఆమె ఏడుస్తోంది.

ప్రేమతోకాక....భయంతో గొంతు జీరబోయి వస్తున్న ఆమె శోకం...నక్కవూళలా వుంది.

ఇవేవీ భరించలేనట్టు.... లలిత శరీరం కుంచించుకు పోతుంది. ఆ ఏడ్పుల్లో పోలీసులొచ్చి ఎవర్ని ఏమి నిలదీస్తారోననే భయమే ఎక్కువ.

లలిత కాళ్ళవేపు నిల్చున్న 'సారధి' శవం వైపు జాలిగా చూసాడు,

మౌనాన్ని విడిచి మాట్లాడేది తనతోనే అయినా...ఏనాడు శరీరాన్ని అంటుకోనిచ్చేది కాదు. ఛీ...ఎన్ని రోజులు ఖర్చుచేసాను.

ఒక్కసారైనా ముద్దుపెట్టుకోనిచ్చేది కాదు. కేవలం మాటలకోసమే స్నేహం చేసిందా? చనిపోయేముందయినా ఒక్కసారి తనతో కలిస్తే బావుండు. ప్రేమ మీద కవిత్వం బాగా పనిచేస్తుందని....తన మీద కవిత లల్లి చెబితే ఆప్యాయంగా చూసేది. కాని అంటుకోనిచ్చేది కాదు.

తనిక బెదిరిస్తూ లెటర్రాస్తేనైనా లొంగిపోతుందను కున్నాడు. అలాగే రాసాడు కూడా.

"క్షమించు లలిత! తన మేనకోడల్ని నే పెళ్ళిచేసుకోనంటే చస్తానంది మా అమ్మ. ఎంతయినా తల్లికదా! నువ్వు ప్రేమిస్తున్నావో లేదో తెలీక నేను ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నాను.

ఈ రోజు సాయంత్రం పార్క్‌లో పొదల మాటున నువ్వు నాకు చేరువవుతే నన్ను ప్రేమిస్తున్నట్టు అర్థం చేసుకుంటాను. లేకపోతే మేనకోడలితో పెళ్ళికి సిద్ధమవుతాను—" అని రాసి అందించాడు.

ఆ సాయంత్రమంతా ఎదిరిచూసాడు. రాలేదు సరికదా! తెల్లారే సరికి శవంగా వుంది.

తన వల్లే చావలేదు కదా??

మరి తను రాసిన ఉత్తరం ఎక్కడపెట్టిందో? ఎవడికైనా దొరికితే....? పోనీ ఇక్కడ్నించి జారుకుంటేనో...?

"ప్రక్కకు జరగండి....పోలీసులొస్తున్నారు." 'స్కడ్'ని పేట్రియాట్ ఢీకొన్నట్టు చెప్పారెవరో.

గుమ్మం దగ్గర బూట్లు టకటకలాడితే భయంగా ముడుచుకుపోయారంతా...

పోలీసుల్ని చూసి జనం ప్రక్కకు తప్పుకుంది.

లలిత శవమ్మీది ఈగలు గంజితో తడిసిన ఖాకీదుస్తులు మీద వాలాయి.

మౌన నిద్రలో....లలిత!!!

* * *

పోస్ట్‌మార్టం గది దగ్గర నిరీక్షిస్తున్నారంతా!

కత్తీ ఏడ్పుల్ని కాసేపు కప్పిపుచ్చుకొని....గ్లిసరిన్ లేకుండానే కుండపోతగా కురిపించగల కన్నీటి వర్షానికి కాసేపు అడ్డుకట్టవేసి....ఎవరు కటకటాలు లెక్కించాల్సి వస్తుందోనన్న బెంగగా నిరీక్షిస్తున్నారు.

రెండు గంటల తర్వాత....

లలిత శవం గదినించి బయటికి వచ్చాక సర్టిఫికెట్ రాస్తూ డాక్టర్ చెప్పాడు.

"లలిత సెరబ్రల్ హెమరేజ్ అనే జబ్బు వలన చనిపోయింది" అని అంతే!

పెద్ద పెట్టున ఏడ్వటం మొదలెట్టారంతా!

రాగం ఒక్కటే అయినా ఇందాకటి ఏడ్పులకి, ఇప్పటి ఏడ్పులకి చాలా వ్యత్యాసం వుంది. ఆ వ్యత్యాసం ఒక లలిత ఆత్మ మాత్రమే అర్థం చేసుకోగలదు.

ఏ నిందా అంటగట్టనందుకు ప్రేమగా ఏడుస్తున్నారు.

ఈ కన్నీళ్లు కత్తీవి కావు.

బాధ చిక్కగా పేరుకుపోతే....ఇందాకటి ఆలోచనలన్ని మరిచి బావురుమని ఏడుస్తున్నారు.

ఆ ఏడ్పులు...ప్రక్కవారి మనసుని కలచివేసేంత విషాదంగా వున్నాయి. ఇప్పుడు అందరి మనసుల్లోనూ లలిత చావుకి కారణమైన వాడు దొరికాడు.

వాడు .... భగవంతుడు !!! ★